## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# మోదీ దిష్టిబొమ్మ దహనం

- కేంద్రం తీరుపై మండిపడ్డ టిపిసిసి సభ్యులు నాగా సీతారాములు
- ప్రజాస్వామ్య దేశంలో చీకటిరోజులంటూ ఆగ్రహం





**శామ్, మార్చి25(కెరటం ప్రతినిధి)**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని కుట్రపూరితంగా రద్దు చేయడం అప్రజాస్వామికమని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్ర మోడీ నియంతృత్వ విధానాన్ని అంతం చేయాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని, ప్రజాస్వామ్య దేశంలో ఇవి చీకటి రోజులుగా అభివర్ణిస్తూ రాహుల్ గాంధీ మీద తీసుకొన్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబిద్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాడు 1978లో ఇందిరా గాంధీని కూడా అప్పటి జనతాపార్టీ డిస్మిస్ చేస్తే ప్రజాధారణతో 1980లో ప్రధానిగా పార్లమెంట్ లో అడుగుపెట్టిన విధానాన్ని గుర్తుచేసుకుంటూ.. రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి, భావ ప్రకటన స్వేచ్ఛకు గొడ్డలిపెట్టులాంటిదని అన్నారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ భారత్ జోడో యాత్ర చేపట్టడం, అదానీ మోడీ చీకటి స్నేహంపై నిలదీయడం కేంద్రానికి రుచించలేదని అన్నారు. అదానీ కంపెనీల వ్యవహారాలపై జేపీసీ వేయాలని పార్లమెంట్ వేదికగా పోరాటం చేయడం, ప్రధాని మోడీకి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయన్నారు. రాహుల్ గాంధీ మీద వచ్చిన తీర్పుపై హైకోర్ట్ లో అప్పీల్ చేసుకొనేందుకు నెలరోజులు గడువు ఇచ్చినా కూడా న్యాయవ్యవస్థ ఆదేశాలు గౌరవించకుండా చట్టవిరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బీజేపీ తీసుకొన్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. భవిష్యత్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ పోటీ చేయకూడదనే దురుద్దేశంతో భారతీయ జనతా పార్టీ చేసిన కుట్ర ఈరోజు బహిర్గతమైందని దీనిని దేశ ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ దేశంలో ప్రధాని ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, నరేంద్ర మోదీ, అమిత్ షా ఇద్దరు కలిసి అదానీ, అంబానీ లాంటి బడా వ్యాపారవేత్తలకు ఈ దేశాన్ని అమ్మేస్తున్నారని, కేంద్రప్రభుత్వ నియంతృత్వ ధోరణిని, అప్రజాస్వామిక విధానాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. లోక్ సభలో ఒక ఎంపీని అనర్హత వేటు వేయాలంటే, రాష్ట్రపతి, ఎన్నికల కమిషనర్ తో సంప్రదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కానీ ఈ బీజేపీ ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి గల సంస్థలను నిర్వీర్యం చేస్తూ తమకు అనుకూలంగా ఉండేలా చూసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వాదులు, మేధావులు ఈ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రతి ఒక్కరూ గమనిస్తూనే ఉన్నారని రాబోయే రోజులు బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని నాగా సీతారాములు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్కె అబిద్, కొత్తగూడెం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బానోత్ కొటేష్ నాయక్, సుజాతనగర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాచిన శ్రీకాంత్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు లోసెట్టి నాగార్జున, ఓబీసీ జిల్లా కన్వీనర్ బాలు భద్ర రావు, సోషల్ మీడియా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వీరాపురం రామలక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గరిక జయరాజు, చిమట చంద్రయ్య, చిమట చిన్న వెంకటేశ్వర్లు, సంతోష్, యువజన కాంగ్రెస్ నాయకులు సురేష్ గుప్తా, తెల్లబోయిన కవిన్, సంపత్, తేజావత్ సాయి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.






## ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఎస్ఓటు జిఎం శ్రీరమేష్

**శామ్, మార్చి25(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియా జి.ఎం. జక్కం రమేశ్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం ఏరియా గౌతంపూర్ ప్రొ.జయశంకర్ గ్రౌండ్‌ను కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జిఎం శ్రీరమేష్, కొత్తగూడెం ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ పరిశీలించినారు. ప్రొ.జయశంకర్ గ్రౌండ్‌కు సంభందించిన ఇంటర్నల్ పనులు, ఏ విధంగా జరుగుతున్నాయి, ఎక్కడ వరకు వచ్చాయని పరిశీలించడం జరిగినది. దానికి కావలసిన మౌలిక వసతులు గాని, ఇంకా కావలసిన వసతులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించినారు. క్రీడాకారుల అబ్యర్ధన మేరకు రజాక్, నెట్ ప్రాక్టీస్ కోసం లైటింగ్ టొవర్స్, లైట్స్ కావాలని ఎస్ఓటు జిఎం శ్రీరమేష్‌ని కోరినరు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జిఎం శ్రీరమేష్, కొత్తగూడెం ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎం. డి రజాక్, పిట్ సెక్రెటరీ శేఖర్ బాబు, కమ్యునికేషన్ కో-ఆర్డినేటర్ కే. శ్రీనివాస్ రెడ్డి, రుద్రంపూర్ వాసులు, రుద్రంపూర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

